ప్రజాశక్తి

శనివారం 8 నవంబర్ 2025 5

శ్రీ సత్యసాయి



అంబరాన్నంటిన రెవెన్యూ క్రీడా సంబరం



బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభిస్తున్న సిసిఎల్ఎ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.జయలక్ష్మి



రెవెన్యూ క్రీడా పోటీల సందర్భంగా వందేమాతరం గీతాలాపనలో సిసిఎల్ఎ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.జయలక్ష్మి, తదితరులు



సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా దుర్యోధనుడి వేషధారణలో అనంతపురం డిఆర్ఓ మలోలా

ప్రజాశక్తి -అనంతపురం

ఎపి రెవెన్యూ ఉద్యోగుల క్రీడా సంబరాలు శుక్రవారం అట్టహాసంగా ఆరంభమయ్యాయి. అనంతపురం నగరంలోని ఆర్డీటీ క్రీడా గ్రామంలో మూడు రోజులపాటు ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెవెన్యూ ఉద్యోగుల క్రీడలు జరుగుతున్న విషయం తెలిసిందే. శుక్రవారం ఉదయం క్రీడలను ప్రారంభించేందుకు సిసిఎల్ఎ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.జయలక్ష్మి ముఖ్య అతిథిగా విచ్చేశారు. క్రీడా పతావిష్కరణ అనంతరం వందేమాతరం 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వందేమాతర గీతాలాపన జరిగింది. అనంతరం రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన రెవెన్యూ క్రీడాకారుల బృందాలు మార్చ్‌ఫాస్టు నిర్వహించాయి. మార్చ్‌ఫాస్టు బాగా చేసిన జిల్లాల్లో కాకినాడ మొదటి స్థానంలో నిలువగా, అనంతపురం ద్వితీయ స్థానం, తూర్పుగోదావరి మూడవ స్థానం, నంద్యాల నాలుగో స్థానంలో నిలిచింది. ఈ బృందాలను సిసిఎల్ఎ చీఫ్ కమిషన్ జి.జయలక్ష్మి సత్కరించారు. అనంతరం ఆటల పోటీలను ప్రారంభించారు. ఈసందర్భంగా మైదానంలో దిగి జయలక్ష్మి క్రికెట్ బ్యాట్ పట్టి బ్యాటింగు చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఉద్యోగులను ఉద్దేశించి జయలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలోని 26 జిల్లాలల నుంచి రెవెన్యూ ఉద్యోగులు ఇక్కడికి విచ్చేసి ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. ఆటల్లో లాగానే పనిలోనూ ఉద్యోగులు అదే స్ఫూర్తితో పనిచేయాలని పేర్కొన్నారు. మంచి వాతావరణంలో ఎక్కువ సేవలు అందించడానికి క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాలు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. ఇక్కడ ఇంతటి చక్కటి ఏర్పాట్లు చేసిన జిల్లా రెవెన్యూ ఉద్యోగులను ఆమె అభినందించారు. జిల్లా కలెక్టరు ఆనంద్ మాట్లాడుతూ మొట్టమొదటిసారి రెవెన్యూ ఉద్యోగుల సంఘం క్రీడలు అనంతపురం జిల్లాలో జరగడం ఆనందకరమన్నారు. ఈ క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాలు విజయవంతమవ్వాలని ఆకాంక్షించారు. ఇందులో పాల్గొనే క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో వ్యవహరించాలని సూచించారు. రెవెన్యూ ఉద్యోగులు నిరంతరం ఒత్తిడిలో పనిచేస్తుంటారన్నారు. అట్టి వారికి ఇటువంటి క్రీడలు ఉత్సాహాన్ని నింపడంతోపాటు టీమ్ స్పిరిట్‌తో పనిచేయడం నేర్పుతాయని పేర్కొన్నారు ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇప్పటి వరకు ఆరుసార్లు రాష్ట్ర స్థాయి క్రీడలు జరిగాయని చెప్పారు. ఇప్పుడు అనంతపురంలో జరుగుతున్నది ఏడవ రాష్ట్ర క్రీడోత్సవాలని చెప్పారు. నిత్యం పని ఒత్తిడిలో సతమతమయ్యే రెవెన్యూ ఉద్యోగులకు ఇవి ఆటవిడుపుగా ఉంటూ ఉత్సాహాన్ని నింపుతాయని చెప్పారు. అనంతరం అవుట్‌డోర్, ఇండోర్ ఆటల పోటీలు ప్రారంభమయ్యాయి. ఆయా పోల్స్ వారీగా పోటీలు జరిగాయి. సాయంత్రం ఆరు గంటల నుంచి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా కలెక్టరు ఆనంద్, సత్యసాయి జిల్లా కలెక్టరు శ్యాం ప్రసాద్, ఉమ్మడి జిల్లాల జాయింట్ కలెక్టర్లు శివ నారాయణ శర్మ, మౌర్య భరద్వాజ్, అసిస్టెంట్ కలెక్టరు సచిన్ రహార్, డిఆర్ఓ మలోల, సత్యసాయి జిల్లా డిఆర్ఓ సూర్యనారాయణరెడ్డి, ఫారెస్టు సెటిల్‌మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి, ఎపి రెవెన్యూ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకట రాజేశ్, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రరెడ్డి, ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేట్ ప్రెసిడెంట్ త్రినాథరావు, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు దివాకర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల వివరాలు....

శుక్రవారం ఉదయం నుండి సాయంత్రం 6 గంటల వరకు ఆర్ డి టి స్టేడియంలో 7 ఏపీ రెవెన్యూ రాష్ట్రస్థాయి క్రీడా, కల్చరల్ మీట్ జరిగాయి. వాలీబాల్, కబడ్డీ, త్రోబాల్, బాడ్మింటన్. క్యారమ్స్, టేబుల్‌టెన్నీస్ తదితర విభాగాల్లో పురుషులు, మహిళల విభాగంలో పోటీలు ఆసక్తికరంగా సాగాయి.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

స్థానిక ఆర్డీటీ స్టేడియంలో శుక్రవారం సాయంత్రం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమాల నిర్వహణ లో భాగంగా ఆటపాట కార్యక్రమాలు జరిగాయి. సింగింగ్, డాన్స్, దాండియా, డ్రామా, టాక్ షో, నాటికలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లా నుంచి పాల్గొన్న రెవెన్యూ ఉద్యోగులు వారి యొక్క కళా ప్రతిభా పాటవాలను ప్రదర్శించి రంజింప చేశారు. అనంతపురం రెవెన్యూ డివిజన్ అధికారి మలోలా చేసిన పాన్సు శీను, సంగీత విభావరి ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాలలో ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి వెంకట రాజేష్, అనంతపురం ఆర్డీవో కేశవ నాయుడు ఎఫ్ఎస్ఓ రామకృష్ణారెడ్డి, ఎస్‌డిసిలు మల్లికార్జున , రామ్మోహన్ ఆనంద్, తిప్పే నాయక్, మల్లికార్జున రెడ్డి, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు దివాకర్ బాబు, కార్యదర్శి సోమశేఖర్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు సంజీవరెడ్డి, కార్యదర్శి హరి ప్రసాద్ రెడ్డి, సత్యసాయి జిల్లా ఏపీ ఆర్ఎస్ఓ అధ్యక్షులు మధు నాయక్, కార్యదర్శి మైనుద్దీన్, మీడియా ఇన్చార్జి మునివేలు, డి ఎస్ డి ఓ మంజుల, అన్ని జిల్లాల రెవెన్యూ ఉద్యోగులు ఉమ్మడి జిల్లాల ఆర్డీవోలు, తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.




మహిళా ఉద్యోగులు మార్చిఫాస్ట్

చిలమత్తూరులో ఇంటి, నీటి పన్నులు స్వాహా..!

పాత తేదీలతో మాన్యువల్ రశీదులు వెలుగులోకి..

ప్రజాశక్తి-చిలమత్తూరు



పాతతేదీతో ఇచ్చిన మాన్యువల్ రశీదు

చిలమత్తూరు మేజర్ పంచాయితీలో ప్రజలు పన్నుల రూపంలో చెల్లించిన లక్షలాది రూపాయలను కొందరు కార్యదర్శులు స్వాహా చేసినట్లు తెలుస్తోంది. ప్రజల నుంచి ఇంటి, నీటి పన్నులు వసూలు చేసి రశీదులు ఇస్తారు. అయితే ఇక్కడి పంచాయతీ కార్యదర్శులు తమ సిబ్బందికి సీల్ ఇచ్చి అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు సమాచారం. రశీదుల్లో కొన్ని ఒరిజినల్ ఎంట్రీలు ఉండగా మరికొన్ని మాన్యువల్ రశీదులు ఇచ్చి రూ. లక్షలు వసూళ్లకు పాల్పడినట్టుగా తెలుస్తోంది. కొందరు కార్యదర్శులు ఫ్యాక్సీ మైల్ సీల్ చేయించుకొని, అక్కడి నుంచి బదిలీ అయినా కానీ పాత తేదీలు వేసి వసూళ్లు చేసుకొని రశీదులు ఇచ్చినట్లు తెలుస్తోంది. 2022లో చిలమత్తూరు కార్యదర్శి, ప్రస్తుత కోడూరు కార్యదర్శి భాస్కర్ పేరుతో ఆ సీల్ కలిగిన రశీదు తాజాగా వెలుగులోకి రావడం కలకలం రేపుతోంది. ఇంటి, నీటి పన్నులు, బిల్డింగ్ అప్రూవల్స్ వంటి వాటికి ఆ సీళ్లను వినియోగించారు. ప్రస్తుతం బిల్లుల చెల్లింపులు ఆన్‌లైన్ ద్వారానే కొనసాగుతుండగా, గతంలో పెండింగ్ బకాయిలను మాత్రం సదరు కార్యదర్శి సీల్‌ను వినియోగిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి భాస్కర్‌ను వివరణ కోరగా, తనకేమీ తెలియదని, తాను ఎలాంటి రశీదులు ఇవ్వలేదని బుకాయించారు.

వెస్ట్ ఆఫ్రికాలో ఒడిసి యువకుడి నిర్బంధం

విముక్తి కల్పించాలంటూ వీడియోలో వేడుకోలు

ప్రజాశక్తి - ఓబుల దేవర చెరువు



చంద్రకుమార్‌రెడ్డి

బతుకు తెరువు కోసం దేశం కానీ దేశానికి వలస వెళ్లిన శ్రీసత్యసాయి జిల్లా ఓబుళదేరవచెరువు మండలానికి చెందిన యువకుడు అక్కడ అష్ట కష్టాలు పడుతున్నాడు. కంపెనీ వారు పెడుతున్న వేధింపులతో బలవన్మరణానికి సిద్ధమవుతున్నాడు. ఎలాగైనా తనని కాపాడాలని సెల్ఫీ వీడియోను పంపించాడు. మండల పరిధిలోని వణుకువారి పల్లికి చెందిన చంద్రకుమార్ రెడ్డి వెస్ట్ ఆఫ్రికాలోని ఘన దేశంలోని జిఎంఆర్ ఇండస్ట్రీలో సేల్స్ మేనేజర్‌గా చేరాడు. కంపెనీలోని డబ్బులను వాడుకున్నాడన్న నెపంతో చంద్రకుమార్ రెడ్డిని యాజమాన్యం ఇబ్బందులకు గురిచేస్తోంది. చివరికి అతడి చేతనే రూ 5 లక్షల కూడా కట్టించుకునీ ఇండియాకు తిరిగి పంపకుండా బంధించింది. మూడు రోజుల క్రితం యాజమాన్యం అతని మీద స్టాక్ దొంగతనం చేసినట్లుగా అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో బాధితుడు తనను వదిలేయకుంటే ఆత్మహత్య చేసుకుంటానని విడియోలో తెలిపాడు. జిఎంఆర్ ఇండస్ట్రీకి చెందిన గణేశం ముత్యాల రెడ్డి చైర్మన్ గా, ఆయన కొడుకు కౌశిక్ రెడ్డి మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారన్నారు. వీరి నుంచి ఎలాగైనా కాపాడాలని బాధితుడు పోలీసులను కోరుతున్నాడు.

సత్యసాయి శతజయంతి ఉత్సవాల నిర్వహణకు పటిష్ట చర్యలు

స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ఎలాంటి పారిశుధ్యం లోపం లేకుండా సత్య సాయి బాబా శతజయంతి ఉత్సవాలను నిర్వహించి పుట్టపర్తి కీర్తిని ప్రపంచానికి చాటాలని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ హాలులో జిల్లాలో స్వచ్ఛంధ్ర కార్యక్రమాల అమలు, సత్యసాయి శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని పుట్టపర్తిలో చేపట్టిన పారిశుధ్య కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆధ్వర్యంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశం ప్రారంభంలో కలెక్టర్ మాట్లాడుతూ శతజయంతి ఉత్సవాలకు ప్రణాళిక బద్ధంగా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని చైర్మన్ కు వివరించారు. ఈ సందర్భంగా పట్టణంలో చేపట్టిన పారిశుధ్య కార్యక్రమాలు, మౌలిక వసతుల కల్పన, తదితరాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పట్టాభిరాం మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈనెల 19న పుట్టపర్తి రాబోతున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ ఇంకా అనేకమంది విశిష్ట అతిధులు, ప్రముఖుల, కేంద్ర మంత్రులు, ప్రముఖులు పుట్టపర్తి వస్తున్న నేపథ్యంలో స్వచ్ఛ్ ఆంధ్ర కార్పొరేషన్ తరపున పారిశుధ్య విషయంలో ఎలాంటి లోపం లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ శత జయంతి కార్యక్రమంలో పనిచేయడానికి పుట్టపర్తి మున్సిపాలిటీ కి ఉన్న వాహనాలకు అదనంగా ఈనెల 16వ తేదీ కల్లా ఒక పది వాహనాలు ప్రత్యేకంగా ఇక్కడికి పంపిస్తున్నామన్నారు. ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్, అర్బన్ రూరల్ కు చెందిన మున్సిపల్, పంచాయతీ అధికారులతో సమావేశం నిర్వహించి తగ్గిన విధంగా సూచనలు ఇచ్చామన్నారు. ప్రత్యేకంగా టాయిలెట్ల పైన కూడా దృష్టి పెట్టి దాదాపు 250 తాత్కాలిక పబ్లిక్ టాయిలెట్లు ఏర్పాటు చేయడం, వాటికి తాగినంత నీటి వసతి కల్పించడం లాంటి చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమీక్ష సమావేశంలో ఆర్డబ్ల్యూఎస్ రాష్ట్ర నోడల్ అధికారి టీ ప్రభాకర్, ఆర్డీవో సువర్ణ, మున్సిపల్ కమిషనర్ క్రాంతి కుమార్, పబ్లిక్ హెల్త్ అధికారి నరసింహ, డిపిఓ సమత, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, శ్రీ సత్యసాయి ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న పట్టాభి, కలెక్టర్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-హిందూపురం

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్.డి.జి.ఎస్ కళాశాల అభివృద్ధి కమిటీ కార్యదర్శి బైసాని రాంప్రసాద్ సూచించారు. కళాశాల యన్.యస్.యస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా శుక్రవారం పూలకుంట గ్రామ పరిధిలో ఉన్న శివాలయం, రహదారులలో వాలంటీర్లు శ్రమదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్, పిఒ బి. రాజన్న, ఎన్.సి.సి. లెఫ్ట్ నెంట్ ఫణీంద్ర, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

పట్టణంలోని సప్తగిరి డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1ఆధ్వర్యంలో శుక్రవారం కొల్లకుంటలో ప్రత్యేక శిబిరంలో భాగంగా సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని సప్తగిరి డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనాథ్ రెడ్డి, ఏవో బి. గంగిరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ -1 పోగ్రాం ఆఫీసర్ ఎస్.పార్థసారథి, ఎన్ఎస్ఎస్ పిఒ కేశవరెడ్డి ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి విమానాశ్రయంలో మంత్రి లోకేష్‌కు ఘన స్వాగతం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

రాష్ట్ర ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు పుట్టపర్తి సత్యసాయి విమానాశ్రయంలో శుక్రవారం సాయంత్రం ఘన స్వాగతం లభించింది. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ కొమ్మారెడ్డి పట్టాభిరాం, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, ఎంపీ లు బి కే పార్థసారథి, అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు పల్లె సింధూర రెడ్డి, అమిలినేని సురేంద్రబాబు, బండారు శ్రావణి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, సత్య సాయి జిల్లా తెలుగుదేశం అధ్యక్షులు ఆంజనేయులు, కూటమి నాయకులు సామకోటి ఆదినారాయణ, మైనార్టీ నాయకులు మహమ్మద్ రఫీ , బిజెపి జిల్లా అధ్యక్షులు, జిఎం శేఖర్, నియోజకవర్గ ఎమ్మెల్యే ,నియోజకవర్గ ప్రజాప్రతినిధులు కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఉమ్మడి అనంతపురం జిల్లా పర్యటనకు మంత్రి నారా లోకేష్ శుక్రవారం ఇక్కడికి వచ్చారు. శనివారం కళ్యాణదుర్గంలో కనకదాస విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి లోకేష్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో అనంతపురం ఉమ్మడి జిల్లాల పర్యటనకు శుక్రవారం సాయంత్రం 4:15 నిమిషాలకు పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకున్నారు. సత్య సాయి బాబా చిత్రపటాన్ని నారా లోకేష్ కు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి చేతుల మీదుగా బహుకరించారు. ఈ నవంబర్ మాసంలో పుట్టపర్తి భగవాన్ శ్రీ సత్యసాయిబాబా 100వ జయంతోత్సవాలకు ముఖ్య అతిథిగా పుట్టపర్తికి రావాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మంత్రి నారా లోకేష్ ను ఆహ్వానించారు.

నారా లోకేష్ ను కలిసిన ఎమ్మెల్యే కందికుంట

కదిరి అర్బన్ : విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ను కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ కలిశారు . కళ్యాణదుర్గం పర్యటనలో భాగంగా పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకున్న తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్‌ని కందికుంట కలిశారు. అనంతరం మంత్రితో పాటు ఎమ్మెల్యే కందికుంట కళ్యాణదుర్గం పర్యటనకు వెళ్లారు.



నారాలోకేష్‌కు పుష్పగుచ్ఛ ం అందజేస్తున్న ఆర్థికశాఖ మంత్రి

ప్రణాళికతో చదివితే వంద శాతం ఫలితాలు

జిల్లా ఉప విద్యాధికారి జాన్ రెడ్డప్ప

ప్రజాశక్తి-హిందూపురం

విద్యార్థులు ప్రణాళికతో చదివితే వంద శాతం ఫలితాలు సాధిస్తారని జిల్లా ఉప విద్యాధికారి జాన్ రెడ్డప్ప పేర్కొన్నారు. సువర్ణ భారతి విద్యా సంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం రూరల్ మండలం పూలకుంట సమీపంలో ఉన్న లోటస్ పాఠశాలలో ప్రభుత్వ పాఠశాలల పదవ తరగతి విద్యార్థులకు విద్యాసంస్థల వ్యవస్థాపక అధ్యక్షులు నీలకంఠ రెడ్డి ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జాన్ రెడ్డప్పతో పాటు అసిస్టెంట్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ లాజర్, ప్రముఖ వ్యక్తిత్వ వికాసం నిపుణులు క్రియేటర్ క్రిష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రియేటర్ క్రిష్ణ పదవ తరగతి పరీక్షలకు ఏ విధంగా సంసిద్ధత కావాలి, దానికి సంబంధించి ప్రణాళికలు ఎలా రూపొందించుకోవాలి, పరీక్షలు ఏ విధంగా రాయాలి, పరీక్షలు రాసే సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి తదితర అంశాలను వివరించారు. విద్యా సంస్థల అధ్యక్షులు నీలకంఠ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యాసంస్థల ఆధ్వర్యంలో అధికారులతో పాటు క్రియేటర్ క్రిష్ణను సన్మానించారు. ఈ కార్యక్రమంలో లేపాక్షి మండల విద్యాశాఖ అధికారి నాగరాజు, ఎంఇఒ - 2 కుళ్లాయప్ప, కళాశాల ప్రిన్సిపల్ రవీంద్రనాథ్ రెడ్డి, విద్యాసంస్థల ఉపాధ్యక్షులు విజయలక్ష్మి, డైరెక్టర్ ప్రజీత్ రెడ్డి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుల్లో స్ఫూర్తి నింపిన గేయం 'వందేమాతరం'

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పట్టణంలోని జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం వందేమాతరం 150 ఏళ్ల వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి 'వందేమాతరం' గీతాలపన చేశారు. ఎస్పీ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల్లో స్ఫూర్తి నింపిన 'వందేమాతరం' గేయానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ వేడుకలు నిర్వహించామన్నారు. 1875 నవంబర్ 7వ తేదీ మహాకవి బంకిం చంద్ర ఛటర్జీ రాసిన ఈ గేయం తొలిసారిగా 'ఆనంద్ మఠ్' నవలలో ప్రచురితమైందన్నారు. పోలీసులు దేశభక్తి భావనతో సేవలందిం చాలని, ప్రజలు స్వాతంత్ర్య పోరాట చరిత్రను స్మరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఎస్పీ అంకిత సురాన మహావీర్, ఎఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఏవో సుజాత, సూపరింటెండెంట్లు సరస్వతి, మల్లికార్జున, సీసీ చిరంజీవి, ఎస్‌బి సిఐ వెంకటేశ్వర్లు, సిఐలు శ్రీనివాసులు, ఇస్మాయిల్, ఆర్ఐలు వలి, మహేష్, రవికుమార్, ఆర్ఎస్ఐలు వీరన్న, ప్రదీప్‌సింగ్, ప్రసాద్, ఎఆర్, డిపిఒ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా స్వాతంత్ర్య సమరయోధుల్లో స్ఫూర్తి నింపిన జాతీయ గేయం 'వందేమాతరం' 150 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు వందేమాతరం గేయాన్ని ఆలపించారు. ప్రతిజ్ఞ చేశారు. జాతీయజెండా చేతబూని పురవీధుల్లో ర్యాలీలు నిర్వహించారు. మానవహారంగా ఏర్పడ్డారు. ప్రముఖులు మాట్లాడుతూ బంకిం చంద్ర ఛటర్జీ రాసిన వందేమాతరం గేయం స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించి, బ్రిటీష్ వారి చెవులు, భారత వినువీధుల్లో మార్మోగిందన్నారు. చివరగా విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు.



వందేమాతరం 150 ఏళ్ల వేడుకల్లో ఎస్పీ, పోలీసు సిబ్బంది

పార్టీ విధానాలు అతిక్రమించడం వల్లే వెంకటేష్ బహిష్కరణ

సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఆర్థిక అక్రమాలకు పాల్పడటం, పార్టీ క్రమశిక్షణ పద్ధతులకు భిన్నంగా వ్యవహరించడం వల్లనే ఈఎస్. వెంకటేష్‌ను సిపిఎం ప్రాథమిక సభ్యత్వం నుండి తొలగిస్తున్నట్లు ఆపార్టీ నాయకులు తెలిపారు. శుక్రవారం పుట్టపర్తి సిపిఎం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు హరి, జంగాలపల్లి పెద్దన్న, ఫిరంగి ప్రవీణ్ కుమార్, ప్రాంతీయ కార్యదర్శి బ్యాళ్ల అంజి తదితరులు మాట్లాడారు. ఈఎస్ వెంకటేష్ మూడు నెలల నుండి ఆరోపణలు ఎదుర్కొంటున్నారని దానిపై ధర్మవరంలో నిర్వహించిన కమిటీ సమావేశంలో ఆయనపై చర్యలు తీసుకొని పార్టీ నుండి తొలగించాలని నిర్ణయించామని చెప్పారు. ఈనేపథ్యంలోనే ఆయనను సిపిఎం ప్రాథమిక సభ్యత్వం నుండి తొలగిస్తున్నట్లు నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. పేదలకు ఇంటి పట్టాలు, భూ పంపిణీ కోసం సిపిఎం ప్రాణ త్యాగాలకైనా సిద్ధమవుతుంటే ఈ ఎస్ వెంకటేష్ తన స్వలాభాల కోసం నిడిమామిడి పొలంలో సర్వే నెంబర్ 181-34 ఖాతా నెంబర్ 22.7 లో మూడు ఎకరాల భూమిని తమ భార్య పేరు మీద పట్టా పొందాడన్నారు. ఇది పార్టీ విధివిధానాలకు విరుద్ధమని తెలిపారు. నిరు పేదలకు పంచి ఇవ్వాల్సిన భూమిని పార్టీ అండతో అధికారులను ప్రలోభపెట్టి తీసుకున్నారన్నారు. ఇది పిత్రాజితం ఎలా వస్తుందని, వీరి తండ్రులు,తాతల ఎవరు ఇక్కడ లేనప్పుడు పిత్రాజితం ఎలా వస్తుందని వారు ప్రశ్నించారు. తనపై చేస్తున్న అవినీతి ఆరోపణలు నిరాధారమని ఆయన చెబుతున్నాడని అలాంటప్పుడు పార్టీ సభ్యులతో వచ్చి సంప్రదింపులు జరపకుండా ఎలా మాట్లాడుతున్నారని అన్నారు. పైపెచ్చు ఆయన సిపిఎం నాయకులపై బెదిరింపులకు దిగుతున్నారని చెప్పారు. ఈఎస్ వెంకటేష్‌కు చిత్తశుద్ధి ఉంటే తీసుకున్న భూమిని ప్రభుత్వానికి వెనక్కి ఇవ్వాలని అన్నారు. పార్టీలో ఎవరైనా నిధుల దుర్వినియోగం ,అవినీతికి పాల్పడు తుంటే బహిరంగ చర్చకు సిద్ధమని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. పార్టీ విధానాలకు వ్యతిరేకంగా ఎవరు వ్యవహరించిన అలాంటి వారిపై చర్యలు తప్పవని చెప్పారు.



విలేకరుల సమావేశంలో పాల్గొన్న సిపిఎం నాయకులు

వైద్య కళాశాలల ప్రయివేటీకరణ అన్యాయం : వైసిపి

ప్రజాశక్తి-హిందూపురం

వైద్య కళాశాలలను ప్రయివేటీ కరణ చేస్తే కూటమి ప్రభుత్వాన్ని కూకటి వేళ్ళతో సహా పెకిలించడానికి రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు సిద్ధంగా ఉన్నారని వైసిపి అబ్జర్వర్ ఆనంద రంగారెడ్డి, హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త దీపికా వేణు రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం హిందూపురం రూరల్ మండలం తూమకుంట పంచాయతీలో రచ్చబండ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి వీరితోపాటు రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి మధుమతి రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పంచాయతీలో ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ, జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలకు పునాది రాళ్ల వేసి పనులను ప్రారంభించడం జరిగింది. ఇందులో ఇప్పటికే ఐదు మెడికల్ కళాశాలలు ప్రారంభం అయ్యాయన్నారు. పేదలకు ప్రభుత్వ వైద్యాన్ని అందని ద్రాక్షగా మార్చడమే ధ్యేయంగా పెట్టుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్ని కళాశాలలను ప్రైవేటీకరణ చేయడానికి సిద్ధమయ్యారన్నారు. దీనిని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా వైసిపి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. అనంతరం వార్డు కమిటీలను ఎంపిక చేశారు. ఈ

క్యాన్సర్ నిర్మూలనపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

చిన్న చికిత్సతో పెద్ద ప్రమాదం నుంచి బయట పడవచ్చునని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఫైరోజ్‌బేగం తెలిపారు. అంతర్జాతీయ క్యాన్సర్ నిర్మూలన దినోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణంలో చేపట్టిన అవగాహన ర్యాలీని స్థానిక ప్రశాంతి గ్రామం వద్ద డిఎంహెచ్ఒ పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ డిఎంహెచ్ఒ కార్యాలయం నుంచి సై జంక్షన్ వరకూ నిర్వహించారు. డిఎంహెచ్ఒ మాట్లాడుతూ క్యాన్సర్ చాలా భయంకరమైన వ్యాధి అయినా భయపడాల్సిన పని లేదన్నారు. క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తించి చికిత్స పొందితే నయం అవుతుందన్నారు. ర్యాలీలో జిల్లా స్టాటిస్టికల్ ఆఫీసర్ కళాధర్, వైద్యులు సునీల్ కుమార్, నాగేంద్ర, భవ్యశ్రీ, మునిచంద్రిక, నదీష్, ప్రభాకర్‌రెడ్డి, మలేరియా సిబ్బంది బాబావలి, సిహెచ్ఒ వస్తున్న, వైద్య సిబ్బంది రామాంజినమ్మ, ముత్యాలప్ప, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఓబులదేవచెరువు : స్క్రీనింగ్‌తో క్యాన్సర్ వ్యాధిని జయించవచ్చని వైద్యాధికారి డాక్టర్ కమల్ రోహిత్ తెలిపారు. స్థానిక పిహెచ్‌సి ప్రాంగణంలో క్యాన్సర్ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ లక్షణాలు వివరిస్తూ, అవి కనిపించిన వెంటనే ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు. వైద్య సిబ్బంది వ్యాధుల సర్వేలకు వచ్చినప్పుడు ప్రజలు వారితో సంపూర్ణంగా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ప్రమీల, దిల్షాద్, దేవ్లానాయక్, రామకృష్ణమ్మ, కేశర్, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు అరుణజ్యోతి, వసుంధర, బిందు భార్గవి, ఆరోగ్య కార్యకర్తలు ఇందిరమ్మ, శ్యామల, లక్ష్మీదేవి, అరుణ, అఖిల, ప్రభాకర్, గోపాల్‌నాయక్, ఆశా కార్యకర్తలు అంజలి, తార, మంజుల, ఉమాదేవి, రాధ, సుజాత, కల్పన, సూరిత తదితరులు పాల్గొన్నారు.


పచ్చ జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఒ ఫిరోజ్‌బేగం

ముదిగుబ్బ : స్థానిక పిహెచ్‌సిలో అంతర్జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం నిర్వహించారు. డాక్టర్ల రాజేంద్రనాథ్ మాట్లాడుతూ క్యాన్సర్‌తో పాటు మలేరియా, డెంగీ, తదితర వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే గ్రామాల్లో ఎఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా వర్కర్లు చేపట్టాల్సిన కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో సిహెచ్ఒ సరస్వతమ్మ, పిహెచ్ఎన్ లలితమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కదిరిలో విశాల్ మార్ట్ ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణంలోని అనంతపురం రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన విశాల్ మార్ట్‌ను శుక్రవారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణ ప్రజలకు నాణ్యమైన వస్తువులను అందించాలని విశాల్ మార్ట్ సిబ్బందికి సూచించారు. ఈ మార్ట్‌లో అన్ని రకాల వస్తువులు ఒకే చోట అందుబాటులో ఉంటాయని, పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వినియోగదారులు, మార్ట్ సిబ్బంది , తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపునకు దరఖాస్తుల ఆహ్వానం

పుట్టపర్తి రూరల్ : కొత్తచెరువు మండలంలో 44వ మద్యం షాపునకు ఈ నెల 10వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ నాగరాజు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రూ. 2 లక్షల డిడి తీసి వాటికి ఆధార్ కార్డు జత చేసి పుట్టపర్తి ప్రొహిబిషన్, ఎక్సైజ్ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఈ నెల 12వ తేదీ కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ పద్ధతిలో లాటరీ తీస్తారన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొందరు మద్యం విక్రయదారులకు కౌన్సెలింగ్ ఇచ్చామని, అలాగే తహశీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. ఎవరైనా బెల్ట్ షాప్ నిర్వహిస్తే పిడి యాక్ట్ నమోదు చేస్తామని, నగర బహిష్కరిస్తామని హెచ్చరించారు.

ఉచిత గ్యాస్ కనెక్షన్‌కు..

కొత్తచెరువు : ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం కింద ఉచిత గ్యాస్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకోవా లని స్థానిక ప్రశాంతి గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు రాజీవ్‌దేవ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా ఇండేన్, హెచ్‌పి, భారత్ గ్యాస్ కనెక్షన్ లేని వారు మాత్రమే అర్హులన్నారు. రేషన్ కార్డులోని కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులు, లబ్ధిదారులని బ్యాంకు ఖాతా, ఎస్సీ, ఎస్టీలైతే కుల ధ్రువీకరణ పత్రం, రెండు కలర్ ఫొటోలు గ్యాస్ ఏజెన్సీ కార్యాలయంలో అందజేసి, ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

ముదిగుబ్బలో వీధి కుక్కల బెడద

ముదిగుబ్బ : ముదిగుబ్బ పట్టణంలో వీధి కుక్కలు రాత్రి పగలు తేడా లేకుండా గుంపులు, గుంపులుగా రోడ్లపై సంచరిస్తూ ప్రజలపై దాడి చేస్తున్నాయి. దీంతో స్థానికులు రోడ్డుపైకి రావాలంటే భయాందోళ నలకు గురివుతున్నారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి వీధి కుక్కలను నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు.

రేషన్‌కార్డుదారులకు ఈకేవైసీ తప్పనిసరి

ముదిగుబ్బ : రేషన్‌కార్డుదారులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని మండల రేషన్ డీలర్ల అసోసియేషన్ నాయకులు తెలిపారు. ఈకేవైసీ చేయించుకోని లబ్ధిదారుల రేషన్‌కార్డులు రద్దవుతాయని స్పష్టం చేశారు. కావున మండలంలో రేషన్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబ సభ్యులు సంబంధిత రేషన్ షాపులో ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు.

ఉచిత పశువైద్యశిబిరం

ధర్మవరం రూరల్ : రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకంలో భాగంగా శుక్రవారం మండలంలోని తిప్పేపల్లి గ్రామంలో జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. పశు వైద్యాధికారి డాక్టర్ వెంకటేష్ మాట్లాడుతూ మొత్తం 53 పశువులు రాగా గర్భకోశ వ్యాధులు, చూలు కట్టని, సకాలంలో ఎదకు రాని పశువులకు చికిత్స, చూడి నిర్ధారణ పరీక్షలు చేశామన్నారు. శిబిరంలో డా. శ్రీకాంత్, చింతలపల్లి పశువైద్యధికారి డా. శేఖర్, పశువైద్య సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు 'ఉపాధి' సిబ్బంది వినతి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

వేతనాలు చెల్లించడంతో పాటు అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఎంజిఎన్‌ఆర్‌ఈజిఎస్, జిల్లా వాటర్ మేనేజ్‌మెంట్, సాంకేతిక సహాయకులు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ 4 నెలలుగా వేతనాలు అందక కుటుంబ పోషణ భారమైందని, తక్షణమే బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే 23శాతం పిఆర్‌సి, ఉద్యోగోన్నతులు, గ్రేడ్ ఫిక్సేషన్, జీత భత్యాల్లో వ్యత్యాసాలు, గ్రాట్యుటీ అమలు, ఔట్ సోర్సింగ్ వారిని ఎఫ్టీఈలుగా మార్పు, హెల్త్ కార్డులు, తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే మీ సమస్యలను సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. వినతి ఇచ్చిన వారిలో డ్వామా జెఎసి ప్రెసిడెంట్ మనోహర్, కార్యదర్శి వరప్రసాద్, యూనియన్ నాయకులు, ఉపాధి సిబ్బంది ఉన్నారు.

సమస్యలను డిప్యూటీ సిఎం దృష్టికి తీసుకెళ్తా..

బుక్కపట్నం : ఉపాధి హామీ సిబ్బంది సమస్యలను డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ డైరెక్టర్, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పత్తి చంద్రశేఖర్ తెలిపారు. ఉపాధి హామీ జిల్లా జెఎసి ఆధ్వర్యంలో సభ్యులు పత్తి చంద్రశేఖర్‌కు వినతి పత్రం సమర్పించారు. వారిలో ఉపాధి హామీ జెఎసి జిల్లా అధ్యక్షులు మనోహర్, కార్యదర్శి వరప్రసాద్, జనసేన అనిల్, లోకేష్, సాయి, ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.


పత్తి చంద్రశేఖర్‌కు వినతి ఇస్తున్న ఉపాధి హామీ సిబ్బంది

విద్యార్థులు నైపుణ్యం పెంచుకోవాలి : డిఇఒ

ప్రజాశక్తి-కొత్తచెరువు

విద్యార్థులు నైపుణ్యం పెంపొందించుకోవాలని డిఇఒ జి.కృష్ణప్ప సూచించారు. స్థానిక జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో శుక్రవారం జిల్లాస్థాయి వృత్తి నైపుణ్య పోటీలు నిర్వహించగా 110 పాఠశాలల నుంచి 600 మంది విద్యార్థులు పాల్గొని 2004 ప్రాజెక్టులను ప్రదర్శించారు. అందులో ఎలక్ట్రానిక్ కంప్యూటర్ అప్లికేషన్, ఆటో మేటివ్ అగ్రికల్చర్, బ్యాంకింగ్, ఫుడ్ ప్రాసెసింగ్, బ్యూటీషియన్ తదితర విభాగాల్లో 10 ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. కార్యక్రమంలో సర్వ శిక్ష ప్రాజెక్టు కోఆర్డినేటర్ దేవరాజ్, జిసిడిఒ సంపూర్ణ, ఒకేషనల్ ఆఫీసర్ మధు, మనోహర్, ఎంఇఒలు జయచంద్ర, సోమశేఖర్ పాల్గొన్నారు.


తాము రూపొందించిన ప్రాజెక్టును చూపుతున్న విద్యార్థినులు

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ : ఎమ్మెల్యే


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే రాజు

ప్రజాశక్తి-మడకశిర టౌన్

ప్రజల సమస్యలు తెలుసుకుని, పరిష్కరించేందుకే ప్రజాదర్బార్ నిర్వహించామని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు తెలిపారు. పట్టణంలోని తన క్యాంపు కార్యాలయం శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. అందులో ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఎక్కువగా 1-బి, పట్టాదారు పాసుపుస్తకం, వృద్ధాప్య పింఛన్లు, ప్రభుత్వ గృహాల కోసం అర్జీలు అందాయి. ప్రజల సమస్యలను సావదానంగా విన్న వారు వాటిని త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్లు, సింగిల్‌విండో అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

కనకదాసు విగ్రహావిష్కరణకు తరలివెళ్దాం

కురుబ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రామ్మోహన్

ప్రజాశక్తి-నల్లచెరువు

భక్త కనకదాసు 538వ జయంత్యుత్సవాల్లో భాగంగా కళ్యాణదుర్గం పట్టణంలోని హిందూపురం బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన 9 అడుగుల భక్త కనకదాసు కాంస్య విగ్రహాన్ని శనివారం ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆవిష్కరించనున్నారని కురుబ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామ్మోహన్ తెలిపారు. కనకదాసు విగ్రహావిష్కరణ కార్యక్రమానికి మండల నుంచి కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, కురుబ సామాజిక వర్గం ప్రజలు పెద్దఎత్తున తరలివెళ్లి జయప్రదం చేయాలని రామ్మోహన్ పిలుపునిచ్చారు



పలువురికి కేతిరెడ్డి పరామర్శ

ప్రజాశక్తి-ముదిగుబ్బ

మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి శుక్రవారం పలువురిని పరామర్శించారు. ముందుగా ఆయన మండలంలోని నల్లచెర్లోపల్లి గ్రామానికి చెందిన క్రిష్ణయ్య కుమారుడు సాయికుమార్ వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న పట్టణానికి చెందిన దామానుపల్లి ఓబిరెడ్డి ఇంటికి వెళ్లి పరామర్శించారు. అలాగే నక్కలపల్లి గ్రామానికి చెందిన చలామారెడ్డి మృతిచెందడంత వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం జొన్నలకొత్తపల్లి గ్రామానికి చెందిన సాయి ఇటీవల ప్రమాదంలో గాయపడగా వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట నాయకులు పి.నారాయణరెడ్డి, ఉపసర్పంచి లోకేశ్వర్‌రెడ్డి, మనోహర్, జయమ్మ, చంద్ర ఉన్నారు.

శ్మశానవాటికకు దారి కోసం పాదయాత్ర

ప్రజాశక్తి-చిలమత్తూరు

గ్రామంలో శ్మశానవాటికకు రహదారి కల్పించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని దేమకేతేపల్లి పంచాయతీ పరిధిలోని కొర్లకుంట ఎస్సీ కాలనీవాసులు వారం రోజులుగా పోరాటం కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. అయినా అధికారులు స్పందించకపోవడంతో శుక్రవారం వారు తమ ఆవేదనను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు కొర్లకుంట గ్రామం నుంచి పుట్టపర్తిలోని కలెక్టర్ కార్యాలయం వరకూ పాదయాత్ర చేపట్టారు. పాదయాత్రలో కాలనీవాసులు, వృద్ధులు, యువకులు పాల్గొని శ్మశాన వాటికకు దారి చూపాలని నినాదాలు చేశారు. మార్గమధ్యలో చిలమత్తూరులో బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అధికారులు సమస్యను పరిష్యరించకపోతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని కాలనీవాసులు హెచ్చరించారు.



పాదయాత్రగా వెళ్తున్న కొర్లకుంట ఎస్సీ కాలనీ వాసులు


మంత్రి నారా లోకేష్‌కు క్రేన్ సాయంతో గజమాల వేస్తున్న సంధా రాఘవ

ధర్మవరంలో మంత్రి లోకేష్‌కు ఘన స్వాగతం

ధర్మవరం రూరల్ : రాష్ట్ర ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు శుక్రవారం పట్టణంలో టిడిపి నాయకులు సందా రాఘవ, పట్టణ అధ్యక్షులు పరిసే సుధాకర్ ఘనంగా స్వాగతం పలికారు. మంత్రి లోకేష్ కళ్యాణదుర్గం వెళ్తూ మార్గ మధ్యలో పట్టణంలో ప్రవేశించారు. ఆ సమయంలో స్థానిక కాలేజీ కూడలిలో వారు క్రేన్ సాయంతో మంత్రికి గజమాల వేసి స్వాగతం పలికారు. అలాగే టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున కాలేజీ సర్కిల్‌కు చేరుకొని మంత్రిని పూలమాలలతో సత్కరించారు. అనంతరం మంత్రి అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకుసాగారు. మంత్రి పర్యటన సందర్భంగా సందా రాఘవ కార్యకర్తలకు భోజనం ఏర్పాటు చేశారు. ర్యాలీలో నాయకులు మహేష్‌చౌదరి, కమతం కాటమయ్య, మాధవరెడ్డి, నాగూర్ హుసేన్, తదితరులు పాల్గొన్నారు.

పారదర్శక పోలీసింగ్ అందిస్తాం : ఎఎస్పీ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ప్రజలకు దగ్గరగా ఉంటూ, పారదర్శకమైన పోలీసింగ్ అందిస్తానని అడిషనల్ ఎస్పీ అంకిత సురాన మహావీర్ తెలిపారు. మన్యం జిల్లా పార్వతీపురం సబ్ డివిజనల్ అధికారిగా విధులు నిర్వహి స్తున్న ఈమె ఎఎస్పీగా ఉద్యోగోన్నతిపై ఇక్కడికి బదిలీ అయ్యారు. ఆమె శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని అడిషనల్ ఎస్పీ ఛాంబర్ లో బాధ్యతలు స్వీకరించారు. ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్‌ని మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేయగా ఎస్పీ ఆమెకు అభినందనలు తెలిపారు. అనంతరం నూతన ఎఎస్పీ మాట్లాడుతూ పోలీసు అధికారులు, సిబ్బంది, ప్రజల సహకారంతో జిల్లాలో శాంతిభద్రతలు, మహిళలు, చిన్నారుల రక్షణే ప్రథమ కర్తవంగా పని చేస్తానన్నారు. జిల్లాకు ఉన్న ప్రత్యేకతను కాపాడడానికి తప్పక కృషి చేస్తానని తెలిపారు. సమర్థవంతమైన పోలీసింగ్ అనేది ప్రజల నమ్మకం సహకారంపై ఆధారపడి ఉంటుందని తాను నమ్ముతున్నట్లు తెలిపారు. నూతన ఎఎస్పీని ఎఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఏవో సుజాత, సూపరింటెండెంట్లు సరస్వతి, మల్లికార్జున, సీసీ చిరంజీవి, ఎస్‌బి సిఐ వెంకటేశ్వర్లు, ఆర్‌ఐలు వలి, మహేష్, రవికుమార్, సిఐలు, ఆర్ఎస్ఐలు, డిపిఒ సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి పూలబొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న ఎఎస్పీ అంకిత సురానా

ఎంపిడిఒపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి

ప్రజాశక్తి-మడకశిర టౌన్

రొళ్ల ఎంపిడిఒపై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి తక్షణమే అరెస్ట్ చేయాలని ఎపి ఎన్జీవో నియోజకవర్గ అధ్యక్షులు రాము, ఉపాధ్యక్షులు హరి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు ఉద్యోగ సంఘాలతో కలిసి డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఎంపిడిఒపై దాడిని ఖండిస్తూ నియోజకవర్గ వ్యాప్తంగా ఉద్యోగులు నల్లా బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన వ్యక్తం చేశారు. పలు మండలాల్లో నిరసన ర్యాలీలు నిర్వహించి తహశీల్దార్లకు వినతిపత్రాలు ఇచ్చారు. ప్రభుత్వ ఉద్యోగులపై దాడి చేస్తే ఏమాత్రం ఉపేక్షించబోమని హెచ్చరించారు. ముమ్మందు ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల జెఎసి నాయకులు, మినిస్టీరియల్ ఉద్యోగ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


డిటికి వినతిపత్రం ఇస్తున్న ఎపి ఎన్జీవో నాయకులు

జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు బి.కార్తీక్ ఎంపిక

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

జాతీయ స్థాయి కుస్తీ(రెజ్లింగ్) పోటీలకు మండలంలోని నాగలూరు వద్ద ఉన్న రూపా రాజా పిసిఎంఆర్ పాఠశాల విద్యార్థి బి.కార్తీక్ ఎంపికైనట్లు పాఠశాల చైర్మన్ హర్షవర్ధన్, డైరెక్టర్ రూపా రాజాకృష్ణ, కరస్పాండెంట్ నాగమోహన్‌రెడ్డి తెలిపారు. పాఠశాలలో శుక్రవారం వారు మాట్లాడుతూ ఇటీవల విజయవాడలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జరిగిన అండర్-17 రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో బి.కార్తీక్ అత్యుత్తమ ప్రతిభ చాటి బంగారు పతకం సాధించాడన్నారు. కార్తీక్ ఉత్తర ప్రదేశ్‌లో జాతీయ స్థాయిలో జరిగే రెజ్లింగ్ పోటీలకు ఎంపికయ్యాడన్నారు. అలాగే రాష్ట్ర స్థాయి పోటీల్లో తమ విద్యార్థులు టి.దిలీప్ రజతం, బి.యశ్వంత్ కాంస్య పతకాలు సాధించి సత్తా చాటార న్నారు. అలాగే రాష్ట్రస్థాయిలో కాంస్య పతకం సాధించిన అరుణ్‌కుమార్‌రెడ్డిని అభినందించారు. తమ విద్యార్థులు జిల్లా, రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల్లో రాణించడం ఎంతో గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో రూపా జగదీశ్, ప్రిన్సిపల్ నరేష్‌కుమార్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, తదితరులు పాల్గొన్నారు.


ప్రతిభ చాటిన విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

గ్రీవెన్స్‌లో అందిన అర్జీలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి అధికారులను హెచ్చరించారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. అందులో ఎమ్మెల్యేతో పాటు మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి, అధికా రులు పాల్గొని ప్రజల నుంచి అర్జీలు తీసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎక్కువగా రెవెన్యూ తగాదాలు, ఆస్తి వివాదాలు, విద్యుత్, నూతన గృహాలు, పింఛన్లు, తదితర సమస్యలపై అర్జీలు అందాయన్నారు. అధికారులు ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించాలన్నారు. మాజీ మంత్రి పల్లె మాట్లాడుతూ ఇకపై ప్రతినెలా శుక్రవారం గ్రీవెన్స్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.


అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే సింధూరరెడ్డి

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-బుక్కపట్నం

గ్రామీణ ప్రాంత క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరచాలని హెచ్ఎం జగదీష్ ఆకాంక్షించారు. హెచ్ఎం మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు బలరామ్, యశ్వంత్, 8వ తరగతి విద్యార్థి అయాన్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఇటీవల అనంతపురంలోని ఆర్‌డిటి స్టేడియంలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కబడ్డీ పోటీల్లో తమ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. వారిని హెచ్ఎం అభినందించడంతో పాటు రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయం సాధించి పాఠశాలకు మంచి గుర్తింపు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పిడి రామకృష్ణ, ఉపాధ్యాయ బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

గాండ్లపెంట విద్యార్థుల ప్రతిభ

గాండ్లపెంట : జిల్లా స్థాయిలో నిర్వహించిన రిటైల్ మార్కెటింగ్ ప్రాజెక్టు ప్రదర్శనలో స్థానిక జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటి బహుమతులు అందుకున్నారు. దీంతో శుక్రవారం స్థానిక పాఠశాలలో విద్యార్థుల అభినందన సభ నిర్వహించారు. హెచ్ఎం టి.ప్రసాద్ మాట్లాడుతూ తమ విద్యార్థులు జిల్లా స్థాయిలో నిర్వహించిన స్కిల్ డెవలప్మెంట్ ప్రాజెక్టు ప్రదర్శనలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించడం గర్వంగా ఉందన్నారు. వీరు భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లా స్థాయి ప్రదర్శనలో పాల్గొని బహుమతులు అందుకున్న రిటైల్ ఇన్‌స్పెక్టర్ పి.రజిత, సైన్స్ ఉపాధ్యాయుడు రాజారత్నం, విద్యార్థులు నిహారిక, ముస్కాన్, నక్షత్ర, దీపారెడ్డి, కుమార్‌లను ఉపాధ్యాయులు పామిడి ముంతాజ్ అలీ, చిన్నప్పయ్య, తాహెర్‌అలీ, పిఇటి ఎం.మురార్‌షావలి, చంద్రశేఖర్, విద్యార్థులు అభినందించారు.

హోరాహోరీగా హాకీ పోటీలు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

భారతదేశంలో హాకీ ఆవిర్భవించి వందేళ్లు అయిన సందర్భంగా శుక్రవారం పట్టణంలో హాకీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 4 జట్లు పాల్గొన్నాయి. గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు. అలాగే హాకీ సీనియర్ క్రీడాకారులు జిక్రియ, కోనేటి ఆచార్యులు, ఉడుముల రామచంద్ర, గౌరీప్రసాద్, మహమ్మద్ అస్లాంలను సన్మానించారు. అతిథులు మాట్లాడుతూ మన దేశంలో హాకీ ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంలో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం శుభ పరిణామం అన్నారు. చివరగా హాజరైన క్రీడాకారులకు శ్రీషిరిడి సాయిబాబా సేవా సమితి ఆధ్వర్యంలో అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో హాకీ ఆంధ్రప్రదేశ్ వైస్ ప్రెసిడెంట్, హాకీ జిల్లా జనరల్ సెక్రటరీ సూర్య ప్రకాష్, జిల్లా జాయింట్ సెక్రటరీ అరవింద్‌గౌడ్, చందు, డైరెక్టర్ మారుతి, కిరణ్, కోచ్ హుస్సేన్, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

ప్రజాశక్తి - కదిరి టౌన్

వాల్మీకి, బోయ సామాజిక వర్గం ప్రజలను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరుతూ శుక్రవారం వాల్మీకి సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు బంగారు కృష్ణమూర్తి మంత్రి నారా లోకేశ్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ వాల్మీకి, బోయలు గతంలో ఎస్టీ జాబితాలో ఉన్నారని, ఆ తర్వాత బిసి జాబితాలో చేర్చారన్నారు. ప్రాంతీయ వ్యత్యాసాలు తొలగించి రాష్ట్రంలోని వాల్మీకి, బోయ లను ఎస్టీ జాబితాలో పునరుద్ధరించాలని విన్నవించి నట్లు తెలిపారు. స్పందించిన మంత్రి ఈ సమస్య మా దృష్టిలో ఉందని త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

వైద్య కళాశాలల ప్రయివేటీకరణ తగదు: వైసిపి

ప్రజాశక్తి - చిలమత్తూరు

కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రయివేటీకరణ చేయడం తగదని వైసిపి నాయకులు పేర్కొన్నారు. వైద్య కళాశాలల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ శుక్రవారం ఆ పార్టీ మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని కోడూరు, టేకులోడు పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో స్థానిక నాయకులతో కలిసి కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకుని ప్రభుత్వం ఆధ్వర్యంలోనే వైద్య కళాశాలలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. పేదలకు వైద్యం, వైద్య విద్యను దూరం చేస్తే సహించబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు గిరిధర్‌రాజు, చిన్నప్పయ్య, అశ్వర్థరెడ్డి, జబివుల్లా, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

తెగిన విద్యుత్ వైరు.. తప్పిన ప్రమాదం

రొద్దం : మండలంలోని ఎం.కొత్తపల్లి గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో గ్రామంలోని ప్రధాన కూడలిలో 11 కెవి విద్యుత్ వైరు తెగిపడింది. అయితే ఆ సయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ విద్యుత్ లైన్ మార్చడానికి గత కొన్ని రోజులుగా అధికారులు ఎస్టిమేషన్ వేస్తున్నారే కానీ మార్చలేదు. ఇకనైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ఈ లైన్‌ను పక్కకి మార్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

యువకుడు ఆత్మహత్య

పెనుకొండ : కుటుంబ కలహాలతో తీవ్ర మనస్తాపం చెంది ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం పెనుకొండలో చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు.. పట్టణంలోని ఎగువగడ్డ ప్రాంతంలో నివాసం ఉంటున్న చాకలి కిరణ్(27) మూడేళ్ల క్రితం కళ్యాణదుర్గం మండలం కోడిపల్లి గ్రామానికి చెందిన సంధ్యారాణిని వివాహం చేసుకున్నాడు. అయితే భార్యాభర్తల మధ్య సమస్యలు వచ్చాయి. దీంతో విడిపోవడానికి కోర్టులో విడాకులకు దరఖాస్తు చేసుకున్నారు. గతంలో కోర్టు వాయిదాకు వచ్చిన భార్యతో ఈ విషయమై నవంబర్ 5వ తేదీ వాయిదాకు వచ్చినప్పుడు మాట్లాడుకుని రాజీ అవుదాం.. కుదరకపోతే విడాకులు తీసుకుందామని మాట్లాడుకున్నారు. అయితే సంధ్యారాణి నవంబర్ 5వ తేదీ పెనుకొండకు రాలేదు. కిరణ్ ఫోన్ చేసినా సమాధానం రాలేదు. దీంతో తీవ్ర మనస్థాపం చెందిన కిరణ్ శుక్రవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తండ్రి రాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

గంగమ్మ గుడిలో చోరీ

నల్లచెరువు : మండలంలోని దేవిరెడ్డిపల్లి గ్రామంలో వెలసిన గంగమ్మ దేవాలయంలో పట్టపగలే దొంగలు చోరీకి పాల్పడ్డారు. దొండలు గేటు తాళం పగలగొట్టి లోపలికి ప్రవేశించి హుండి తాళాలను ధ్వంసం చేసి అందులో ఉన్న నగదు ఎత్తుకెళ్లారు. దుండగులు పట్టపగలే ఇలాంటి దుశ్చర్యకు పాల్పడడంపై గ్రామస్తులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు దొంగలను గుర్తించి కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు కోరారు.

పాల ట్యాంకర్ ఢీకొని ఇద్దరికి గాయాలు

చిలమత్తూరు : పాల ట్యాంకర్, ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన ఘటన శుక్రవారం మండలంలోని మొరంపల్లి గ్రామ సమీపంలోని పాల డెయిరీ వద్ద చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని వడ్డేపల్లికి చెందిన గణేష్, ముదిరెడ్డిపల్లికి చెందిన బాబయ్య ద్విచక్ర వాహనంపై కొడికొండ చెక్‌పోస్ట్ నుంచి ముదిరెడ్డిపల్లి వైపు వెళ్తుండగా, మొరంపల్లి పాల డెయిరీ వద్ద అతివేగంగా వచ్చిన పాల ట్యాంకర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో వారిద్దరూ తీవ్రంగా గాయపడగా స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చి బాగేపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే పాల ట్యాంకర్ డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోయాడు. డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగమే ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు

రొద్దం : మండలంలోని రెడ్డిపల్లి గ్రామ చెరువు కట్ట కింద ఉన్న ఎల్లమ్మ దేవాలయం ఆవరణలో గురువారం రాత్రి గుర్తుతెలియని దుండగులు గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపినట్లు పూజారి తెలిపారు. శుక్రవారం ఉదయం గుడిలో పూలు నిర్వహించేందుకు వెళ్లిన పూజారి గుప్త నిధుల కోసం తవ్వడం గమనించి గ్రామస్తులకు తెలిపారు. కాగా ఈ ఆలయ గర్భగుడిలో రెండేళ్ల క్రితం కూడా తవ్వకాలు జరిపారని స్థానికులు తెలిపారు. ఈ విషయంపై పోలీసులకు సమాచారం ఇచ్చారు.